ఎస్సార్బీసీ కాలువలు శిథిలం

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. అప్పట్లో జగన్ తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల వల్ల రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు గ్రహణం పట్టుకుంది. సాగునీటి రంగంపై గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చిన్నచూపు చూడటంతో వ్యవసాయ రంగం కుదేలైంది. కనీసం సాగునీటి కాలువలకు మరమ్మత్తులు కూడా చేయకుండానే వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వం కొనసాగింది. తాజాగా టీడీపీ అధికారంలోకి రాగానే పాత ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించింది. కాలువల మరమ్మత్తులపై ఆరా తీస్తోంది.

- గత ప్రభుత్వం పాపం రైతులకు శాపం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో దుర్భర పరిస్థితి
- మరమ్మతులకూ నోచుకోని వైనం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు



దెబ్బతిన్న ప్రధాన పంటకాలువ



గుర్రపు డెక్కతో మూసుకుపోయిన గొల్లలేరు కెనాల్

అవుకు, జూలై 11: బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా పంట కాలువలు సుదీర్ఘకాలంగా మరమత్తులకు నోచుకోవటం లేదు. కాలువలకు ఇరువైపుల రాతి కట్టడాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూడిక చేరి ముళ్లపొదలతో పంటకాల్వలు మూసుకుపోతున్నాయి. 90శాతం మేర రాతికట్టడాలు శిథిలం కావటంతో కాల్వలకు రంధ్రాలుపడి నీరు వృథాగా పోతోంది. కాలువలకు పడుతున్న రంధ్రాలను పూడ్చుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. దాదాపు 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న గొల్లలేరు డ్రైన్ కూడా గుర్రపు డెక్క ఆకులు, ముళ్లపొదలతో మూసుకుపోయింది. పంట కాలువలకు భారీ గండ్లు పడిన సందర్భాల్లో మాత్రమే ఎస్సార్బీసీ అధికారులు తాత్కాలిక మరమత్తులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపటంలో పూర్తిగా విఫలమవుతున్నారు.



ముళ్లపొదలతో మూసుకపోయిన ప్రధాన చెక్‌డ్యాం

అవుకు మండలంలోని పాలేరు చెరువు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ అవుకు రిజర్వాయర్ 4.148 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మితమైంది. రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు కింద 1614 ఎకరాలు, పాలేరు చెరువు కింద 665 ఎకరాలు లోకల్ ఆయకట్టు సాగవుతుంది. గొల్లలేరు డ్రైన్ కింద అవుకుతో పాటు మండలంలోని లోతట్టు గ్రామాలైన చెన్నంపల్లె, శివవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం, చిన్నకొట్టాల గ్రామాల పరిధిలోని 8వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అలాగే సంగపట్నం కోటావారి చెరువు కింద 255 ఎకరాలు, మెట్టుపల్లె బల్లాకుంట చెరువు కింద 136 ఎకరాలు, కునుకుంట్ల దీక్షితుల వారి చెరువు కింద 156 ఎకరాలు, ఉప్పలపాడు హయత్‌ఖాన్ చెరువు కింద 101 ఎకరాలు వేములపాడు చెరువుకింద 105 ఎకరాలు శింగనపల్లె ఫర్కులేషన్ ట్యాంక్ కింద 150 ఎకరాలు ఆయకట్టు సాగవుతోంది. అయితే ఆయా గ్రామాల్లో ప్రవహించే కాలువలకు ఎక్కడా రాతి కట్టడాలు లేవు. చెక్‌డ్యాంల వద్ద అరకొరగా నిర్మించిన రాతికట్టడాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

దెబ్బతిన్న ప్రధాన పంటకాలువ

అవుకు రిజర్వాయర్ తిమ్మరాజు స్లూయిస్ నుంచి విడుదలయ్యే సాగు నీటిని లోకల్ ఆయకట్టుకు తరలించేందుకు ప్రధాన పంటకాలువ (ఎర్రకాలవ)ను నిర్మించారు. సుదీర్ఘకాలంగా ఈకాలవ మరమ్మతులకు నోచుకోక చాలా చోట్ల దెబ్బతింది. ఈఏడాది రబీ సీజన్‌లో పంటలు సాగవుతున్న తరుణంలో ప్రధాన పంటకాలవ ఏప్రిల్ నెల 10వతేదీన రెండు చోట్ల కుంగిపోయి భారీగండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేశారు. స్లూయిస్ నుంచి విడుదలయ్యే నీరు ఈప్రధాన పంటకాలువకు చేరి అక్కడి నుంచి తిమ్మమ్మ కాలువ, కతువ కాలువల ద్వారా పిల్లకాలువల నుంచి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతుంది. అలాగే గొల్లలేరు నీరు వెళ్లే డ్రైన్ కూడా గుర్రపుడెక్కతో మూసుకుపోయింది. ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధానమైన పంటకాలువలతో పాటు, గొల్లలేరు డ్రైన్‌పై ఎస్సార్బీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు రైతులు విమర్శిస్తున్నారు.



గండిపడ్డ ప్రాంతంలో మట్టికప్పి వదిలేసిన దృశ్యం

చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

అవుకు రిజర్వాయర్‌తో పాటు చెరువుల్లో నీరు ఉన్న సమయంలో కూడా పంటకాలువలు సరిగా లేని కారణంగా చివరి ఆయకట్టుకు నీరు అందక రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పంట కాలువలకు గండ్లు పడి సాగునీరు వృథాగా పోతుండటంతో దాదాపు 1500 ఎకరాల్లో రైతులు మెట్టపంటలను సాగుచేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ ఉన్నతాధికారుల స్పందించి పంట కాలువలకు వెంటనే మరమత్తులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



శిథిలమై పూడిక చేరిన కాలువ

కాలువలకు మరమ్మతులు చేపట్టాలి



ప్రధాన పంటకాలువ చాలా చోట్ల దెబ్బతింది. 3 నెలల క్రితం కాలువకు రెండు చోట్ల 10 అడుగుల మేర గండ్లు పడ్డాయి. మట్టితో కప్పి కాంక్రీట్ పనులు చేయకుండా వదిలేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం సమయానికైనా అధికారులు పంటకాలువలకు మరమత్తులు చేపట్టాలి.

- బొజ్జలయ్య, రైతు, అవుకు

వృథాగా పోతున్న సాగునీరు



పంటకాలువలకు సుదీర్ఘకాలంగా మరమత్తులు చేపట్టకపోవటంతో గండ్లు పడి సాగునీరు వృథాగా పోతోంది. పంటకాలువలకు 90శాతం మేర రాతి కట్టడాలు లేవు. చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఆల్వ దశరథ, రైతు, అవుకు

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

పంటకాలువల మరమత్తుల కోసం 4 సంవత్సరాల క్రితమే రూ.5కోట్లతో అప్పటి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు విడుదల కాలేదు. నూతనంగా తిమ్మరాజు, పాలేరు స్లూయిస్ కింది పంటకాల్వల మరమ్మతుల కోసం రూ.1.46 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- శిఖామణి, ఎస్సార్బీసీ డీఈఈ, అవుకు

మహానందిలో చిరుత



మహానంది ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతపులి

- ఈసారి ఆలయం ఎదుటే సంచారం
- కుక్కను నోట కరుచుకుని వెళ్లిన చిరుతపులి
- భయంతో పరుగులు తీసిన భక్తులు

మహానంది, జూలై 11: మహానంది ఆలయం ఎదుట బుధవారం అర్ధరాత్రి చిరుతపులి సంచరించింది. తిరిగి గురువారం రాత్రి 8 గంటల సమయంలో చిరుత జనావాసాల్లోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. దైవదర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఆలయ పరిసరాల్లో విశ్రాంతి తీసుకుంటున్న భక్తులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. గత వారం రోజుల నుంచి నల్లమల అడవి నుంచి వచ్చిన చిరుతపులి క్షేత్రపరిసరాల్లోనే తిరుగుతోంది. బుధవారం అర్ధరాత్రి ఆలయ ఎదుట భాగంలో పున్నమి అతిథి గృహానికి అతి సమీపంలో ఓ కుక్కను చిరుతపులి నోట కరుచుకుని తిరిగి అడవిలోకి వెళ్తున్నట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. తిరిగి గురువారం రాత్రి 8 గంటల సమయంలో అదే చిరుత ఈశ్వర్‌నగర్ కాలనీలోకి ప్రవేశించింది. అక్కడ మరో కుక్కను నోటితో కరుచుకుని లాక్కెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇంతవరకు దేవస్థానం గోశాల, పరిసరాల్లోని ఈశ్వర్‌నగర్ కాలనీ, ఉద్యోగుల కాలనీ, పార్వతీపురం సమీపంలో సంచరించిన చిరుత ఈ దఫా ఏకంగా మహానంది ఆలయం ముందు భాగంలోకి రావడంతో భక్తులకు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజుల క్రితం ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన గిరిజన బాలుడు నాగన్నపై కూడా చిరుతపులి దాడి చేసి గాయపరిచింది. అప్రమత్తమైన ఆలయ, అటవీ శాఖ అధికారులు మైకుల ద్వారా పులి సంచారంపై ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

బంధించేందుకు సిద్ధమైన అధికారులు

చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. ఎన్ఎస్‌టీఆర్(నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్) అధికారుల నుంచి అనుమతులు రాగానే పులిని బంధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుత కదలికలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అనుమతులు వచ్చిన వెంటనే చిరుతను బంధించేందుకు రెండు బోన్లను కూడా సిద్ధం చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 11: ఉమ్మడి జిల్లాలోని బీడి, సున్నపురాయి, డోలమైటు గని కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీడి కార్మిక సంక్షేమ నిధి వైద్యశాఖ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల పిల్లలు ఆన్‌లైన్‌లో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబరు 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 0120-6619540, 040-29561297కు సంప్రదించాలన్నారు.

ఉర్దూ వర్సిటీలో ప్రవేశానికి గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్), జూలై 11: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ నాలుగేళ్ల హానర్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 20 వరకు గడువు పొడిగించామని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. 23వ తేదీ నుంచి 26లోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. 31వ తేదిన విద్యార్థులకు సీట్ల కేటాయింపులు జరుగుతాయని, వెంటనే కళాశాలలో రిపోర్ట్ చేయాలని, అదే రోజు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

సరసమైన ధరకు నిత్యావసర సరుకులు: కలెక్టర్



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 11: నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతు బజార్లలో సోనామసూరి బియ్యం, కందిపప్పు ధాన్యాలను సరసమైన ధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పద్మావతి నగర్‌లోని రైతు బజారు, టెక్కె మార్కెట్ యార్డులలోని రైతు బజారులలో నంద్యాల జిల్లా హోల్‌సేల్ మండి మర్చంట్స్ అసోసియేషన్ సౌజన్యంతో నాణ్యమైన స్టార్టెక్స్ కందిపప్పు, కర్నూలు సోనామసూరి బియ్యం సరసమైన ధరలకు విక్రయించే ప్రత్యేక కౌంటర్లను కలెక్టర్‌తో పాటు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ సోనామసూరి బియ్యం కిలో రూ. 49, సోనామసూరి రా బియ్యం కిలో రూ.48లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్‌లోని కౌంటర్లలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు విక్రయించనున్నట్లు తెలిపారు. జిల్లాలో నంద్యాల పట్టణంలో రెండు కేంద్రాలతో పాటు ఆత్మకూరు, డోన్, ఆళ్లగడ్డ, పట్టణాలలోని రైతుబజార్‌లలో కూడా ప్రత్యేక కౌంటర్లు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబానికి కేజీ కందిపప్పు, ఐదుకేజీల బియ్యం కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించామని చెప్పారు.

'పని చేయని ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు'

సార్వత్రిక ఎన్నికల కోసం వచ్చిన ఈవీఎంలలో పనిచేయని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను బెంగుళూరుకు తరలిస్తున్నామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం టెక్కె మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సాంకేతిక లోపంతో పనిచేయని ఈవీఎంలు, ట్రైనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, మాక్‌పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, కమిషనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, ఫస్ట్ లెవల్ చెక్‌లో పనిచేయని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్‌లు మొత్తం కలిపి 435 ఈవీఎంలను గుర్తించామని తెలిపారు. వీటన్నింటిని స్కాన్ చేసి ఈనెల 22న బెంగళూరులోని బెల్ కంపెనీ తరలించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ నిరాశే..!

- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందం
- వాసంతికి బాసటగా ప్రజా సంఘాలు
- ఉదయం నుంచి ఘటన స్థలంలోనే ఎంపీ బైరెడ్డి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



గాలింపు చర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 11: ఐదు రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి వాసంతి మృతదేహం కోసం ముచ్చుమర్రి అప్రోచ్ కెనాల్‌లో మూడో రోజు కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. గురువారం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) 30 మందితో కూడిన బృందం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కెమెరాలతో నీటిలో తనిఖీ చేశారు. కానీ వాసంతి మృతదేహం లభించలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉంటూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ రాజకుమారి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాలింపుచర్యలకు సంబంధించిన ఏర్పాట్లు, కేసు దర్యాప్తు విషయాలపై ఆమె ఎస్పీ రఘువీర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాప అదృశ్యమై ఐదు రోజులవుతున్నా ఆచూకి లభించడం లేదని వాసంతి కుటుంబ సభ్యులు, వారి బంధువులు కలెక్టర్ ఎదుట వాపోయారు. అనుమానితులుగా ఉన్న ముగ్గురు మైనర్ బాలురు తప్పుడు సమాచారంతో పోలీసులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. చంపి పడేసిన ప్రదేశాన్ని కరెక్టుగా చూపిస్తే... మా పాపను మేము తీసుకెళ్లి దహనసంస్కారాలు చేసుకుంటామంటూ కలెక్టర్ ఎదుట వాసంతి తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారి ఆచూకి ఈ రోజైనా తెలుస్తుందని గ్రామస్తులు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్దకు చేరుకున్నారు. గాలింపు చర్యలు మూడు రోజులకు చేరినా కూడా లభ్యం కాకపోవడంతో ఈ అప్రోచ్ కాలువలో శవం వేయలేదన్న అనుమాలను కుటుంబ సభ్యులు, బంధువులు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ గాలింపు చర్యలతో పాటు మరో కోణంలో కూడా దర్యాప్తు చేస్తే ఫలితం ఏమైనా ఉంటుందన్న అభిప్రాయాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డా.శబరి

బాసటగా ప్రజా సంఘాలు

వాసంతి ఆచూకీ ఐదు రోజులుగా లభించకపోవడంతో ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలకు దిగారు. నందికొట్కూరులో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ రాజకుమారికి, ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వాల్మీకి సంఘం నాయకులు, సీపీఐ నాయకులు, సీపీఎం నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. వాసంతి మృతదేహాన్ని త్వరితగతిన వెలికి తీయాలని, దోషులకు కఠినంగా శిక్షించాలంటూ కలెక్టర్, ఎస్పీలను కోరారు. న్యాయవాది వెంకటరాముడు, సీపీఐ నాయకులు రమేష్, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీరయ్య, గోపాల్, తదితరులు కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించారు.





వాసంతి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిజనిర్ధారణ అయితే కఠినంగా వ్యవహరిస్తాం

వాసంతి మృతదేహం లభ్యమైన ఈ కేసులో నిజనిర్ధారణ అయితే దోషులపై కఠినంగా వ్యవహరిస్తాం. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. కేసు నిజానిజాలు త్వరలోనే బయటపడతాయి. తప్పు జరిగిందని నిర్ధారణ జరిగితే చట్టపరంగా చాలా కఠినంగా వ్యవహరిస్తాం. ఈ విషయం రాష్ట్రమంతా చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత వాసంతి కుటుంబానికి అన్ని విధాల మద్దతు ఉంటుంది.

- కలెక్టర్ రాజకుమారి, నంద్యాల

అన్ని కోణాల్లో విచారణ జరుగుతోంది

వాసంతి అదృశ్యం కేసులో అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయి. ఎవరూ కూడా అధైర్యపడాల్సిన పని లేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నాం. ఇతర కోణాల్లో కూడా దర్యాప్తు చేస్తున్నాం.

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నంద్యాల

పని చేయని సీసీ కెమెరాలు



నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అప్రోచ్ కాలువ వద్ద ఏం జరుగుతుందన్న విషయాలను పరిశీలించేందుకు గతంలో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్క సీసీ కెమెరా పని చేయడం లేదు. ఎత్తిపోతల పథకానికి వెనుకభాగంలో ఉన్న సీసీ కెమెరా పని చేసి ఉంటే సంఘటనకు సంబంధించి మెరుగైన ఆధారాలు లభించేవి. అలాగే ఎత్తిపోతల పథకం ముందు భాగంలో ఉన్న సీసీ కెమెరా పనిచేసి ఉంటే అప్రోచ్ కాలువ మీదకు ఎవరెవరు వెళ్లారన్న వీడియోలు కూడా రికార్డు అయ్యేవి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కేసును చేదించేందుకు ఆలస్యమవుతోంది.



కాలువ గట్టుపై బారుతుల తీరిన జనం

గుజిరి దుకాణాల్లో నూలుమిల్లు యంత్రాలు

- పట్టపగలే ఆటోలో తరలింపు
- పోలీసుల అదుపులో ఒకరు



ఆటోనగర్‌లోని పాత సామాన్ల అంగడిలోకి తరలిస్తున్న జిన్నింగ్ యంత్రాలు

పాణ్యం, జూలై 11: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని నూలుమిల్లులోని యంత్రాలు గుజిరీ దుకాణాలకు చేరుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన సంస్థలోని ఇనుప వస్తువులను ఇలా కొందరు నంద్యాల ఆటోనగర్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం పట్టపగలే ఆటో లలో ఎంతో విలువైన జిన్నింగ్ యంత్రాలను తరలించారు. మిల్లు వెనుక వైపు నుంచి ఆటోల్లో ఈ యంత్రాలను నంద్యాల ఆటోనగర్‌లోని ఒక పాత సామగ్రిని కొనుగోలు చేసే దుకాణానికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే మిల్లు వద్దకు వెళ్లి అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టెక్స్‌టైల్స్ ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా 1988 జూలై 6 వతేదీన ప్రారంభమైన మిల్లు 1996 మే 6న మూతపడింది. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు ఈ మిల్లులో ఉన్నాయి. అప్పటి నుంచి రాష్ట్ర టెక్స్‌టైల్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెక్యూరిటీని ఏర్పాటు చేసి కోట్లాది రూపాయల విలువైన యంత్ర సామగ్రిని కాపాడుకుంటూ వచ్చారు. కాగా 2020లో సెక్యూరిటీని తొలగించడంతో మిల్లులో దొంగతనాలు పెరిగాయి. అనంతరం కొంత మందిని సెక్యూరిటీగా ఏర్పాటు చేసినా దొంగతనాలు ఆగలేదు. దొంగ సామాన్లు అమ్మే అడ్డాగా ఆటోనగర్ మారినట్లు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఇటీవల పాణ్యం, గడివేముల, బేతంచెర్ల ప్రాంతాలలోని రైతుల మోటార్లు దొంగతనానికి గురై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంఘటనతో ఆటోనగర్‌లో చోరీ చేసిన సామాన్లను కొందరు అమ్ముతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దొంగ సామాన్యులను తరలించే ఆటోలకు ఎటువంటి నెంబరు ప్లేట్లుగానీ, పోలీసు నెంబర్లుగానీ ఉండకపోవడం గమనార్హం.

టూరిజం హబ్‌గా ఓర్వకల్లు రాక్ గార్డెన్

జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం పరిశీలన



కర్నూలు(అర్బన్), జూలై 11: జియాలాజికల్ టూరిజం హబ్‌గా ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి చేయడానికి సర్వేలు నిర్వహించిందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం రాష్ట్రంలో 7 చోట్ల జియాలాజికల్ హెరిటేజ్ సైట్ల సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారంఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను ప్రత్యేక బృందం అధికారి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పరిశీలించింది. అనంతరం అక్కడ హై జీవో కల్చర్ డైవర్సిటీ , జియో టూరిజం అభివృద్ధి దిశగా హై రెవల్యూషన్, డ్రోన్‌ల ద్వారా వీడియోలను చిత్రీకరించారు. సర్వేల అనంతరం కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో జియాలాజికల్ సర్వే నివేదికల ఆధారంగా రాక్ గార్డెన్ పర్యాటకులకు అవసరమైన తీరులో సద్వినియోగం చేసుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సీతారాంసింగ్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన సీతారాంసింగ్ ఆటో నడుపుకుంటూ కుటంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం గాజులపల్లి నుంచి నంద్యాలకు బయలు దేరిన ఆటో నంద్యాల మండలంలోని అయ్యలూరి మెట్టకు చేరుకునే సరికి ఎదు రుగా వచ్చిన ఓ వాహనం ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ సీతారాంసింగ్ తీవ్ర గాయా లతో అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికు లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకే కందిపప్పు

ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన జేసీ నారపురెడ్డి మౌర్య



ధరల పట్టిక



ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: సరసమైన ధరకు నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా గురువారం నుంచి విక్రయాలు ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. సి.క్యాంపు సెంటర్‌లోని రైతుబజారులో సరుకుల ప్రత్యేక కౌంటరును జేసీ గురువారం ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లాలోని సి.క్యాంపు సెంటర్, వెంకట రమణకాలనీల్లోని రైతు బజార్లలో, ఆదోనిలోని మండి మార్కెట్, కర్నూలు అర్బన్ మోర్ మార్కెట్, కర్నూలు డి-మార్ట్, స్పెన్సర్, జ్యోతి మాల్, రిలయన్స్ మొత్తం 9 సెంటర్లలో విక్రయాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కౌంటర్ల ద్వారా కొనుగోలు చేసే వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. వారికి కేజీ కంది పప్పు, ఐదు కేజీల బియ్యం ఇస్తారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.181 ఉన్న కంది పప్పును రూ.160కు రూ.55.85 ఉన్న స్టీమ్డ్ బీపీటీ సోనామసూరి బియ్యాన్ని రూ.49కు రూ.52.40 ఉన్న పచ్చి బీపీటీ సోనామసూరి బియాన్ని రూ.48కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఎస్‌వో కేవీఎస్ఎం ప్రసాద్, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఏఎస్‌వో రామాంజనేయులు, ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

10 తులాల బంగారు, బైక్ స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు, జూలై 11: కర్నూలు నగరంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి పది తులాల బంగారు నగలతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ మోహన్ కిశోర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పల్నాడు జిల్లాకు చెందిన కందుల సత్యనారాయణ ఓ దొంగతనం కేసులో మాచర్ల జైలులో ఉన్నారు. పల్నాడు ప్రాంతానికే చెందిన కుందుర్తి రవికుమార్ సొంతంగా లారీలు రవాణా వ్యాపారం చేస్తూ ఓ కేసులో జైలుకు వెళ్లాడు. అక్కడ నిందితులిద్దరికి స్నేహం కుదిరింది. సత్యనారాయణ దొంగతనాలు చేస్తే బయటి నుంచి బెయిల్ ఇప్పించేలా రవికుమార్‌తో ఒప్పందం కుర్చుకున్నారు. అనుకున్న ప్రకారం ఇద్దరూ బెయిల్‌పై బయటకు వచ్చారు. సత్యనా రాయణ పల్నాడు నుంచి నేరుగా బైక్‌పై కర్నూలుకు వచ్చాడు. గత ఏప్రిల్ నెల 28న గోపీనగర్‌లో ఓ చోరీ చేసి వెళ్లిపోయాడు. తర్వాత జూన్ 20న బాబా బృందావన్ నగర్‌కు వచ్చి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసి తిరిగి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ శంకరయ్య, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీకెమెరాల ఆధారంగా ఓ వ్యక్తి నెంబరు ప్లేట్ లేని బైక్‌పై, హెల్మెట్ పెట్టుకుని వచ్చినట్లు గుర్తించారు. ఈ ఆధారాలతో బైక్ వెళ్లిన మార్గం వెంట ఈ పోలీసు బృందం గాలించింది. కేవలం నెంబరు ప్లేట్ లేకుండానే బైక్‌పై వెళ్లిన నిందితుడు వెళ్లిన మార్గంలోనే పరిశీలించుకుంటూ వెళ్లారు. అలా బళ్లారి చౌరస్తా సమీపంలో నిందితుడు హైదరాబాదు వెళ్లినట్లుగా గుర్తించారు. హైదరాబాదు వెళ్లిన మార్గంలో టోల్‌గేట్, సీసీ కెమెరాలను తనిఖీ చేసుకుంటూ వెళ్లి హైదరాబాదు నుంచి పల్నాడు వెళ్లినట్లుగా గుర్తించారు. చివరగా పల్నాడు వెళ్లి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని నిందితులు ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడికి సహకరించిన రవికుమార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా కందుల సత్యనారాయణపై 36 దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

కర్నూలు రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్ కుమార్



కర్నూలు, జూలై 11: కర్నూలు రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న డీఐజీ విజయరావును డీజీపీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. కోయ ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన మొదట గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఖాజీపేట ఏఎస్పీగా, పార్వతిపురం ఏఎస్పీగా పని చేశారు. విశాఖపట్నం ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, కాకినాడ ఫోర్స్ ఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎస్పీగా పని చేశారు. 16వ బెటాలియన్ ఏపీఎస్పీ కమాండెంట్‌గా విధులు నిర్వహించారు. 2022లో కౌంటర్ టెర్రరిస్టు ఆపరేషన్స్ ఆర్గనైజేషన్‌లో ఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

- 22,235 మందికి సీసీఆర్‌సీ కార్డులు జారే లక్ష్యం
- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: ఈ సంవత్సరం పంటల సాగులో కౌలు రైతులు ఇబ్బంది పడకుండా వారికి సకాలంలో పంట రుణాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా లబ్ది చేకూర్చేందు కోసం కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జేడీ వరలక్ష్మి తెలి పారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో 22,235 మంది కౌలు రైతులను గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించుకు న్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పూర్తి చేసి వారికి సాగుదారు హక్కు పత్రం అందిస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతుల గుర్తింపు కోసం వచ్చే వారం గ్రామ సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కల్లూరులో 3,350 మంది, పత్తికొండలో 2,520, ఎమ్మిగనూరులో 2,790, పాణ్యం నియోజకవర్గంలో 3,350, ఆలూరు నియోజకవర్గంలో 3,465 మంది కౌలు రైతులను, ఎమ్మిగ నూరులో 2,790, కోడుమూరు నియోజకవర్గంలో 4,050 మంది కౌలు రైతులను గుర్తించి వెంటనే వారికి సీసీఆర్‌సీ కార్డులు అందిస్తామని తెలిపారు.

వీఆర్వో అవినీతిపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, జూలై 11: కల్లూరు మండలంలోని ఓ వీఆర్వోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి విచారణ చేపట్టారు. ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో వచ్చిన అవినీతి ఘనాపాటి శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోకు నోటీసులు జారీ చేసిన ఆయన వివరణ తీసుకున్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లతో కలిసి వక్ఫ్‌బోర్డు, ఇరిగేషన్, ప్రభుత్వ భూములను మార్పుచేసి భూమిని అన్యాక్రాంతం చేశారో సర్వే నెంబర్ వారీగా పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కల్లూరు తహసీల్దారును ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. నివేదిక రాగానే క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు తుది నివేదికను అందజేస్తామని చెప్పారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జిల్లా నాయకులు



మంత్రి లోకేశ్‌ను కలిసిన తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు

కర్నూలు(అర్బన్), జూలై 11: టీడీపీ నాయకులకు రక్షణ కల్పించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మంత్రి లోకేశ్‌ను కోరారు. మంగళగిరిలో గురువారం ఆయనను కలిసి జిల్లాలో పరిస్థి తులపై వివరించారు. వైసీపీ మూకల చేతిలో కిరాతకంగా హత్యకు గురైన గిరినాథ్ చౌదరి కుటుంబాన్ని పరామర్శిస్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన గిరినాథ్ చౌదరిని వైసీపీ నాయకులు హత్య చేశారని, ఆయన బాబాయ్ సుబ్బారెడ్డికి ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడిలో గిరినాథ్ చౌదరి సోదరుడు కళ్యాణ్ గాయాలతో బయటపడగా సుబ్బా రెడ్డి త్రుటిలో తప్పించుకున్నారని వివరించారు. సుబ్బారెడ్డికి పార్టీ అండగా నిల వాల్సిన అవసరం ఉందని లోకేశ్‌కు వివరించారు. అలాగే మొన్నటికి మొన్న కప్పట్రాళ్లలో ప్రత్యర్థికి బెయిల్ వస్తే బాధితుడి ఇంటి ఎదుట బాణసంచా కాల్చా రని లోకేశ్‌కు తెలిపారు. గిరినాథ్ చౌదరి కుటుంబంతోపాటు సుబ్బారెడ్డికి ప్రత్యేక రక్షణ కల్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తానని మంత్రి నారా లోకేశ్ చెప్పా రని తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు తెలిపారు. కుటుంబానికి అన్ని రకాలుగా పా ర్టీ అండగా ఉంటుందని, అవసరమైన రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: కొంత మంది దళారులు మత్స్యశాఖలో అమలు చేస్తున్న పథకాల్లో లబ్ధి చేకూరుస్తామని దళారులు ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని మత్స్య శాఖ ఏడీ శ్యామల సూచించారు. గురువారం కర్నూలు నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న వారికే పథకాల్లో లబ్ధి చేకూరు తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 26న పత్తికొండ మండలం పందికోన రిజర్వాయరులో చేపల వేటకు సంబంధించి లీజు ఇవ్వడానికి బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

కౌతాళం, జూలై 11: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వల్లూరు గ్రామంలో జరిగింది. కౌతాళం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వల్లూరు గ్రామానికి చెందిన వాసయ్య గారి ఈరన్న(25)కు కర్ణాటకకు చెందిన పార్వతితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తరువాత ఈరన్న తాగుడుకు బానిసై నిత్యం గొడవ పడుతుండగా పార్వతి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయారు. బుధవారం అర్ధరాత్రి అందరూ పడుకున్న తరువాత ఇంటి ముందున్న వేప చెట్టుకు ఉరి వేసుకున్నారు. ఈరన్న తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలి


ఈర్నపాడులో అవగహన సదస్సులో పాల్గొన్న రైతులు

బండిఆత్మకూరు, జూలై 11: రైతులు ఎరువుల వాడకంలో పంట చివరి వరకు సమతుల్యత పాటించాలని నంద్యాల ఏడీఏ సరళమ్మ సూచించారు. గురువారం మండలంలోని ఈర్నపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భాస్వరం ఎట్టి పరిస్థితుల్లో దుక్కిలో మాత్రమే వేయాలని, పైపాటుగా ఏమాత్రం వేయరాదన్నారు. అలాగే విత్తనశుద్ధి సుడోమోనోఫాస్ ద్రావకంతో ఎలా చేసుకోవాలి, అనంతరం యూరియా, పొటాష్, సల్ఫేట్‌ల వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవోలు చంద్రశేఖర్ రెడ్డి, స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

ఆత్మకూరు, జూలై 11: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, రజాక్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని పారిశుధ్యం లోపించి ప్రజలు అతిసారా వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అనేక వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని తెలిపారు. చిన్నపాటి వర్షాలకే పట్టణంలోని అనేక వీధులు చెరువులను తలపిస్తున్నాయని వివరించారు. అదేవిధంగా పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్లు సైతం లీకేజీలై కలుషితం అవుతున్నాయని తెలిపారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, భాస్కర్, కలిముల్లా, చాంద్, బాషా, జబివుల్లా, రాముడు, రమణ, పుల్లయ్య, కిరణ్, నబి, సామేలు, అంబయ్య, చందు ఉన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: మానవ హక్కుల పరిరక్షణలో జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తమసీల్దార్ చంద్రశేఖరరెడ్డితో పాటు డాక్టర్ రామకృష్ణారెడ్డిలు హాజరై ప్రసంగించారు. జనాభా పెరుగుదల వల్ల దేశం ఎదుర్కొనే సమస్యలను వారు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమణమ్మ, ఇంతియాజ్, డాక్టర్ లలితా సరస్వతి అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

●లయన్స్ క్లబ్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రావూస్ బాలికల జూనియర్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ గెలివి సహదేవుడు, ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నంద్యాలశాఖ అధ్యక్షుడు నిజాముద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ సుంకయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతను సృష్టిస్తే చర్యలు


మాట్లాడుతున్న వైవీ మురళీకృష్ణ

నంద్యాల టౌన్, జూలై 11: జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల హోల్‌సేల్, రీటైల్ డీలర్లను జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. గురువారం డీఈవో కార్యాలయంలో వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో డీలర్లకు పంపిణీ చేసిన ఎరువుల సమాచారాన్ని పంపిణీ చేసిన 24 గంటల్లోగా ఎరువుల కంపెనీల ప్రతినిధులు వారి కంపెనీకి సంబంధించిన ఎరువుల రాకపోకల వివరాలను వ్యవసాయ కార్యాలయానికి క్రమం తప్పకుండా తెలియజేయాలని ఆదేశించారు. ఎరువుల వాడకం అధికంగా ఉండే ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కంపెనీల నుంచి జిల్లాకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలన్నారు. హోల్‌సేల్ డీలర్లందరూ వివిధ కంపెనీలు తమకు కేటాయించిన ఎరువులను వారి పరిధిలోని రీటైల్ డీలర్లకు అందరికీ సమానంగా సరఫరా చేయాలని ఆదేశించారు. హోల్‌సేల్ డీలర్లు వారికి సంబంధించి ఎరువుల స్టాక్ వివరాలను గోదాముల్లో పొందుపరచాలని, స్టాక్ వివరాలను సంబంధింత వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని, కృత్రిమ కొరత సృష్టించరాదని హెచ్చరించారు. సమావేశంలో ఏవోలు ప్రసాదరావు, కళ్యాణ్‌కుమార్, వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్లు పాల్గొన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించండి

నంద్యాల (కల్చరల్), జూలై 11: చిరుతపులి బారినుంచి గిరిజనులకు రక్షణ కల్పించాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో చిరుతపులి గిరిజనలపై దాడి చేస్తుందన్నారు. అటవీశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చిరుతపులి ఎప్పుడు దాడి చేస్తుందోనని గిరిజనులు భయపడుతున్నారని అన్నారు. చిరుత నుంచి గిరిజనులను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రవినాయక్, స్వామినాయక్, బాలనాయక్, జనార్ధన్‌నాయక్, కటారి కృష్ణ ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: గ్రామ పంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు ఐదే నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి వారికి వేతనాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్లాని విజ్ఞప్తి చేశారు.

తల్లిదండ్రులను విచారణ చేయాలి

● పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన


నందికొట్కూరు పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న నాయకులు, వాసంతి కుటుంబ సభ్యులు, బంధువులు

నందికొట్కూరు, జూలై 11: వాసంతి కేసులో విచారణలో ఉన్న ముగ్గురు బాలుర తల్లిదండ్రులను విచారణ చేయాలని వాసంతి తండ్రి మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు సర్కిల్ పోలీస్‌స్టేషన్ ముందు మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వాసంతి తండ్రి మద్దిలేటి మాట్లాడుతూ పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు బాలురలలో ఒకరి తండ్రి నెల రోజులు వెతికినా శవం దొరకదని గ్రామంలో చెబుతూ తిరుగుతున్నాడన్నారు. అతనిపై అనుమానం ఉందని, ముగ్గురు మైనర్ బాలుర తల్లిదండ్రలను అదుపులోకి తీసుకొని విచారణ చేయాలన్నారు. మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి సభ్యులు, న్యాయవాది వెంకటరాముడు మాట్లాడుతూ సంఘటన జరిగి ఐదు రోజులు అవుతున్నా అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలియడం లేదన్నారు. పోలీసుల అదుపులో ఉన్న మైనర్ బాలుర తల్లిదండ్రులు రెచ్చగొట్టే మాటలు మాట్లాడడం సరికాదన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడితే నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన పోలీసులను హెచ్చరించారు. మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, తాలుకా అధ్యక్షుడు రమణ నాయుడులు మాట్లాడుతూ బాలిక గత ఐదు రోజులైనా ఆచూకీ కనిపించకపోవడం బాధాకరమన్నారు. అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రేపు సాయంత్రంలోగా చిన్నారుల నుంచి సమాచారం పూర్తిగా సేకరిస్తామని, అప్పటికి స్పష్టత రాకపోతే వారి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రంలో ముచ్చుమర్రి మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి నాయకులు, వాసంతి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.


అడిషనల్ ఎస్పీకి వివరణ ఇస్తున్న మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి సభ్యుడు వెంకటరాముడు

● **సంఘీభావంగా పట్టణంలో పాఠశాలలకు నేడు సెలవు:**

ముచ్చుమర్రిలో వాసంతి ఘనట పట్ల సంఘీభావంగా పట్టణంలోని పాఠశాలలు నేడు సెలవు ప్రకటించాయి. ముచ్చుమర్రిలో వాసంతి(9) మృతి చెందడంతో నందికొట్కూరు పట్టణంలోని పాఠశాలలు బంద్ పాటిస్తున్నట్లు ప్రకటించారు.

● వాసంతి అనే మైనర్ బాలిక హత్య చేసిన నిందిఉతనలు కఠినంగా శిక్షించాలని టీడీపీ నందికొట్కూరు టౌన్ మహిళా అధ్యక్షురాలు మీనాక్షి డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

● ముచ్చుమర్రి గ్రామంలో వాసంతి (8) ఏళ్ల బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురాం మూర్తి, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని కేజీ రోడ్డుపై సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన సీపీఐ ప్రజాసంఘాలు వాసంతి కుటుంబానికి న్యాయం జరగాలని రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాసంతి అనే బాలిక ఆచూకీ నాలుగు రోజులైనా లభించలేదన్నారు. అభం శుభం తెలియన చిన్నారిని హత్యచేసి ఆపైన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంలో పడేసినట్లు అంగీకరించినట్లు తెలుస్తుందన్నారు. కాబట్టి బాలిక మృతికి కారణమైన వారిని శిక్షించాలని, ప్రభుత్వం బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, కిరణ్, మోషా, ఐసా నాయకులు రంగస్వామి, ఎస్సీఎస్టీ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు నరసింహ, ఏఐటీయూసీ నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో 9ఏళ్ల మైనర్ బాలికను హత్యచేసిన నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 9ఏళ్ల చిన్నారిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి దశలోనే పిల్లలు తప్పుడు మార్గాలను ఎంచుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించేలా దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయి, దిలీప్, లింగేష్, భరత్, రాజు తదితరులు ఉన్నారు.

ధరలను కట్టడి చేసేందుకే విక్రయ కేంద్రాలు

ఆత్మకూరు, జూలై 11: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలను కట్టడి చేసేందుకు పౌరసరఫరాల శాఖ తరుపున ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు తహసీల్దార్ కే.బాబు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనే సరసమైన ధరలతో నాణ్యమైన సరుకుల ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, జెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి నిత్యావసర సరుకుల ధరలను అందుబాటులోకి తీసుకొచ్చే క్రమంలోనే ప్రత్యేక సరుకుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో తొలివిడతగా సోనామసూరీ బియ్యాన్ని కిలో రూ.49, నాణ్యమైన కందిపప్పును కిలో రూ.160కే ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కో విక్రయదారుడిగా గరిష్టగా 5కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా విక్రయదారుడు తప్పనిసరిగా ఆధార్ వివరాలు సమర్పించి కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. కాగా బహిరంగ మార్కెట్‌లో సోనామసూరీ బియ్యం రూ.55.85, కందిపప్పు రూ.181 ధరలు ఉన్నట్లు తెలిపారు. ఈవిక్రయ కేంద్రాల ఏర్పాటుతో ధరలను తగ్గేందుకు అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కలిముల్లా, తిమోతి, ఇరుగదిండ్ల మురళీ, అష్రఫ్ ఎలి, అలిహుసేన్, షాలీఫైల్వాన్ తదితరులు ఉన్నారు.


ఆత్మకూరు నిత్యావసర సరుకుల విక్రయ కేందాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తాం

నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్ జూలై 11 : మండలంలోని నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వ పాలకులు పూర్తి నిర్లక్ష్యం చేశారని, అంతేగాక ఈ పథకం పనిచేయడానికి కనీస నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయలేక రైతులకు ఉపయోగ పడకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇప్పటి నుంచి రైతులకు అన్నిరకాలుకా అందుబాటులో ఉండి ఈ పథకం రైతులకు ఉపయోగ పడేలా పనిచేయిస్తామని అన్నారు. అనంతరం నాగటూరు, కొణిదేల గ్రామాలలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ సెంటర్లలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు చిన్నారులకు మంచి నాణ్యమైన భోజనం పెట్టాలని హెచ్ఎంలను, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం డీఈ నాగార్జునయాదవ్, ఏఈ నారాయణరెడ్డి. నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

దుండగులపై చర్యలు తీసుకోండి

నందికొట్కూరు, జూలై 11: నందికొట్కూరులో తాగునీటి పైపులైన్‌ను కట్ చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పర్యటించారు. కాలనీలోని ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన పైపు లైన్‌ను ఎవరో గుర్తు తెలియని కట్ చేయడంతో తాగునీటి సమస్య తలెత్తిందని కాలనీ వాసులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పైప్ లైన్ ఎవరు కట్ చేశారో వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే నూతన పైపు లైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యేతో పాటు కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

పాణ్యం, జూలై 11 : మండలంలోని గోరుకల్లు, దుర్వేశి రహదారి మరమ్మతు పనులు గురువారం చేపట్టినట్లు టీడీపీ పాణ్యం నియోజకవర్గ బీసీ కన్వీనర్ నంద్యాల రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాల మేరకు గోరుకల్లు నుంచి నందికొట్కూరు రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్లు గుంతు పూడ్చారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, నాగేశ్వరరావు, రామఉశేని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గుంతలు పూడ్చుతున్న దృశ్యం

కౌలు కార్డులపై అవగాహన

గడివేముల, జూలై 11: మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతులకు మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. కౌలు కార్డుల వల్ల బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని అన్నారు. విత్తనాల రాయితీ, పంట నష్ట పరిహారం, భీమా, కనీస మద్దతు ధరతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని అన్నారు. భూ యజమాని ఆధార్‌కార్డు, 1బి, కౌలుదారుడి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం, కౌలు ఖరారునామ పత్రాలతో రెవెన్యూ సిబ్బంది వద్ద దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కౌలు కార్డు కాల పరిమితి 11 నెలలు ఉంటుందని అన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇస్తే భూ యజమానికి ఎలాంటి నష్టం జరగదని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీశైలం, జూలై 11: శ్రీశైలంలోని రింగ్‌రోడ్డు సమీపంలోని గణేశ సదన్ వెనుకవైపు అటవీ ప్రాంతంలో కొంత మంది పేకాట ఆడుతుండడంతో పోలీసులు దాడులు చేశారు. గురువారం సీఐ జి. ప్రసాదరావు మాట్లాడుతూ 20 మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 1,21,190 నగదు, ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యమివ్వాలి

- ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూలై 11: అత్యవసర పనులకు ప్రాధాన్యత నివ్వాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. పాణ్యం, గడివేముల మండలాలల్లోని ఆర్ అండ్‌బీ, పీఆర్, ఎంఐ సమస్యలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో గురువారం నంద్యాల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రివ్యూ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు మండలాలలో ప్రస్తుతం ఏఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలు, టెండర్ దశలో ఉన్న వాటిపై దృష్టిసారించాలన్నారు. ప్రజలకు అత్యవసర సమస్యలను పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గడివేముల బైపాస్ రోడ్డుపై చర్చించినట్లు తెలిపారు. చెరువుల పరిస్థితి, వాటి మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపుపై చర్చించారు. గ్రామాలలో తాగునీటి సమస్యతో పాటు, పారిశుద్య సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం మండల టీడీపీ కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఎంఐ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కొత్తూరులో స్కంద పంచమి, షష్టి పూజలు

పాణ్యం, జూలై 11 : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురువారం ఆషాఢ మాస స్కంద పంచమి, షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి, సురేష్‌శర్మ, రోహిత్ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు స్వామివారికి ప్రాతఃకాల పూజలు, అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపిక

పాములపాడు, జూలై 11 : పాములపాడులోని మోడల్‌స్కూల్ ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పదవతరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి మండలంలోనే టాపర్లుగా నిలిచిన వరుణ్, శ్రీనాథ్ అనే విద్యార్థులకు నూజివీడు, ఇడుపులపాయం ట్రిపుల్ ఐటీ కాలేజీలకు ఎంపికైనట్లు తెలిపారు. మండలంలోనే తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం చాల సంతోషంగా ఉందన్నారు

మహానంది: మహానంది మండలం ఎం.తిమ్మాపురం ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరం పదిలో మంచి మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు గురువారం రాత్రి తెలిపారు. ఇందులో జీ.లలితకు శ్రీకాకుళంలో, డీ.వహీదకు నూజివీడులోని ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చినట్లుగా తెలిపారు.

మిడుతూరు: మిడుతూరు ఐదు మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సత్తాచాటారు. ఆదర్శ పాఠశాలకు చెందిన శ్రావ్యశ్రీ, సోని, భరత్, మానస, జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మహేష్ అను విద్యార్థులు త్రిబల్ ఐటి ప్రవేశమునకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలకు మంచి పేరు తెచ్చినందున ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వసతి గృహం పరిశీలన


వసతి గృహంలో ఆహర పదార్థాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి గోపాల్

ఆత్మకూరు రూరల్, జూలై 11: ఆత్మకూరు మండలం బైర్లూటి గిరిజన గూడెంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. వసతి గృహంలోని పరిసరాలను, వంట గది పరిశుభ్రత,ఆహర పదార్థాలను, మంచి నీటి సౌకర్యాలను పరిశీలించి వసతి గృహ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా విద్యార్థులకు సురక్షిత త్రాగునీటినే అందించాలని, భోజనం తయారు చేసేటప్పుడు వంట పాత్రలను, కూరగాయలను పరిశుభ్రంగా కడగి వంట చేయాలని, పరిసరాలను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం అక్కడి విద్యార్థులకు చిరు రోగాలకు వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ షఫీమున్నీసా,వసతి గృహ సంరక్షకులు శ్రీరాములు,ఉపాధ్యాయులు ఉన్నారు.

సీపీఐ నాయకురాలు అక్కమ్మ మృతి


అక్కమ్మ (ఫైల్)

ఆత్మకూరు, జూలై 11: ఆత్మకూరు పట్టణంలోని గొల్లపేటకు చెందిన సీపీఎం నాయకురాలు అక్కమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు రణధీర్, నరసింహ నాయక్, మంజుల, పుల్లమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని వారు సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, సుధాకర్, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులు జాగ్రత్తలు తీసుకోవాలి

కొత్తపల్లి, జూలై 11: విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మహ్మద్ భేగ్ సూచించారు. గురువారం కొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు డెంగ్యూ, అతిసార, క్షయ వ్యాధి మలేరియా తదితర వ్యాధులపై వైద్యాధికారి అవగాహన కల్పించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వాంతులు, విరేచనాలు అయినట్లయితే ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు జింక్ మాత్రలు 14 రోజుల పాటు వాడాలన్నారు. ముఖ్యంగా జూలై నెలలో దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నాయని, జాగ్రత్తలు పాటించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీబాయిని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బాలకృష్ణ, పీహెచ్ఎన్ ఆయేషా భేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పారిశుధ్య పనులు


కోటగడ్డ వీధిలో దుర్వాజన పేడ దిబ్బను తొలగిస్తున్న జేసీబీ

కొత్తపల్లి, జూలై 11: కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను చేపట్టారు. లోపించిన పారిశుధ్యం అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి పర్యవేక్షణలో గ్రీన్ అంబాసిడర్లు యుద్ధ ప్రాతిపదికన గొల్లపేట, మడ్డిపేట, ఎరువపేట, బస్టాండు ప్రాంతాలలో మురుగునీటిని తొలగించారు. అలాగే కోటగడ్డ వీధిలో పేడదిబ్బలను తొలగించి శుభ్రం చేయించారు.

దేవాలయంలో చోరీ

●వెండి నాగాభరణం, గోల్డ్ కోటెడ్ నగలు అపహరణ

పాణ్యం, జూలై 11 : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని కనకదుర్గా, మంజునాథ ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్వామి వారి వెండి నాగాభరణం, గోల్డ్ కోటెడ్ నగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. కేసు నమోదు చేస్తామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

గోస్పాడు, జూలై 11 : గోస్పాడు మండలం నెహ్రూనగర్ ఫీల్డ్ అసిస్టెంట్ లింగేశ్వరరెడ్డిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిగింది. గురువారం ఏపీడీ బాలాజీ నాయక్ ఫిర్యాదుదారులను, వేతనదారులను విడివిడిగా విచారించారు. ఇటీవల జరిగిన 18వ విడత సామాజిక తనిఖీల్లో లింగేశ్వరరెడ్డిపై పలు ఆరోపణలు వచ్చాయి. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం నివేదికను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీకి అందజేస్తామని ఏపీడీ బాలాజీ నాయక్ తెలిపారు. విచారణలో ఏపీడీ వెంట క్లస్టర్ షేక్షావలి, ప్లాంటేషన్ సూపర్ వైజర్ సుబ్బయ్య, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులను మంజూరు చేయాలి

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: వేసవి సెలవుల్లో పని చేసిన ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి, ముత్తోజీ వీరబ్రహ్మం గురువారం తెలిపారు. పాఠశాలలకు రెండు సంవత్సరాలుగా నిర్వహణ గ్రాంట్ విడుదల చేయడం లేదని సొంత డబ్బు ఖర్చు పెడుతున్నారని ఈ విద్యా సంవత్సరం నుంచైనా నూతన ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన ఇవిజ్ఞప్తి చేశారు. జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను బ్రతికించాలని కోరారు.తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేసి ఆ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.

ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా


కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట సమీపంలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించిందని ఆ కళాశాల చైర్మన్ ఎస్.వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలకు అటానమస్ హోదాను ప్రకిటించిందని ఆయన చెప్పారు. న్యాక్ గుర్తింపు, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు, పరిగణనలోకి తీసుకున్న యూజీసీ అదికారులు అటానమస్ కళాశాలను ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్య ప్రకాశరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా

తప్పిన పెను ప్రమాదం



యర్రగుంట్ల వద్ద రహదారిపై బోల్తాపడిన కంటైనర్

శిరివెళ్ల, జూలై 11 : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై యర్రగుంట్ల ఉషోదయ పాఠశాల సమీపంలో గురువారం తెల్లవారుజామున భారీ కంటైనర్ బోల్తా పడింది. భారీ కంటైనర్‌తో కడప వైపు వెళ్తున్న లారీ యర్రగుంట్ల వద్దకు రాగానే అదుపు తప్పింది. దీంతో భారీ కంటైనర్ రహదారిపై పడిపోయింది. లారీ.. పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కంటైనర్ కిందపడే సమయంలో రహదారిపై ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా భారీ క్రేన్ సహాయంతో కంటైనర్‌ను డివైడర్ మధ్యలోకి చేర్చారు. శిరివెళ్ల పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి

చాగలమర్రి, జూలై 11: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి అన్నారు. గురువారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళా శక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంజామల: ఆడపిల్ల చదువు దేశానికే వెలుగని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. గురువారం నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు లింగ వివక్ష లేకుండా ఆడపిల్లలను కాపాడి వారికి ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఆడపిల్లల రక్షణ కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ఆమె అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు బాలనరసమ్మ, ఓబులమ్మ, రాధా, ఆశా వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాశాల భూమిని ఆక్రమించడం నేరం

బేతంచెర్ల, జూలై 11: బేతంచెర్ల-కర్నూలు రహదారిలో గోరుమానుకొండ సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం 4.08 ఎకరాల భూమిని కేటాయించిందని, కొందరు ఆ భూమిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ గురువారం తెలిపారు. కళాశాలకు కేటాయించిన సర్వే.నెంబరు.547/1ఏ3లో 3.28 ఎకరాలు, మరో సర్వే. నె.550/1ఏ1డీలో 80 సెంట్లు కేటాయించారన్నారు. ఏడాది మార్చి నెల 8వ తేదీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అయితే భవన నిర్మాణానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో టెండరింగ్ ప్రక్రియ ఆలస్యమైందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన స్థలం రికార్డులను 2023 అక్టోబరు నెలలో రెవెన్యూ అధికారులు తమకు అప్పగించారన్నారు. సర్వే.నెం.547/1ఏ3లోని 3.28 ఎకరాల స్థలం కొంత మంది చదును చేస్తున్నారన్న సమాచారం మేరకు పరిశీలించామన్నారు. ఇక్కడున్న రాళ్లతో చదును చేశారని, ఇది ప్రభుత్వస్థలమన్నారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, జూలై 11: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన బాలరాజు అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాజర్‌వల్లి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు .. బాలరాజు తన కూతు రికి ఎక్కించుకుని బైక్‌పై వెళ్తుండగా ఇందిరమ్మ కాలనీకి చెందిన శివ అనే వ్యక్తి కామెంటు చేశారు. బాలరాజు ఇది మంచి పద్ధతి కాదని మందలించి ఇంటికి వెళ్లాడు. అయితే శివ ఇంటికి వెళ్లి తండ్రి రాజు, తల్లి లక్ష్మికి విషయం తెలిపాడు. ముగ్గురు కలిసి బాలరాజు ఇంటి వద్దకు వచ్చి అతడితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో రాజు కర్రతో బాలరాజును కొట్టగా బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అంతలో మురళీకృష్ణ అనే వ్యక్తి బాలరాజును రక్షించేందుకు ప్రయత్నించగా రాజు మురళీకృష్ణ నోటిపై కొట్టడంతో గాయలయ్యాయి. బాలరాజును మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ బాలరాజు భార్య పూజారి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



మోమిన్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

చాగలమర్రి, జూలై 11: చాగలమర్రి గ్రామంలోని ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మోమిన్ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైంది. పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా, మండల టాపర్‌గా నిలిచారు. ఈ విద్యార్థిని ఇడుపుల పాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థిని మోమిన్‌ను హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొహరం ప్రశాంతంగా జరుపుకోవాలి

బేతంచెర్ల, జూలై 11: మండలంలోని గ్రామాల్లోని ప్రజలు మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ శివశంకర్ నాయక్ సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామాల ప్రజలతో ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంజామల: గ్రామాల్లోని ప్రజలు మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రమేష్ రెడ్డి సూచించారు. ఈనెల 17న జరిగే పీర్ల షహదత్ ఏటికి వెళ్లే రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

బ్రాహ్మణులను కించపరచడం తగదు

డోన్(రూరల్), జూలై 11: కొందరు సోషల్ మీడియాలో బ్రాహ్మణులను, దేవతామూర్తులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టడం తగదని వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం సభ్యులు కల్లె శేషావలి శర్మ, శంకర శర్మ, గంగాధర్‌శాస్త్రి, సుబ్రహ్మణ్య శర్మ ఆవేదన వ్యక్తం చేశా రు. గురువారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

పేదలకు అందుబాటులోకి బియ్యం, కందిపప్పు



లబ్ధిదారులకు బియ్యం, కందిబేడలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, జూలై 11: పేదలకు మార్కెట్ ధర కంటే తక్కువకే బియ్యం, కంది పప్పు అందుబాటులో ఉండేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోని రైతు బజార్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని పౌర సరఫరా శాఖ సమక్షంలో పంపిణీ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం పేదలను విస్మరించి నిత్యావసర ధరలను పెంచుతూ ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదలను గుర్తించి కిలో బియ్యం కర్నూలు సోనా రకం రూ. 58 నుంచి రూ.48, నాణ్యమైన కందిపప్పు రూ.180 నుంచి రూ.160 కే ఇచ్చేలా సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారన్నారు. ప్రతి కార్డు దారునికి నెలకు సరిపడ 5 కిలోలు బియ్యం, కిలో కంది పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహమ్మద్, కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ నాయకులు హుసేన్‌బాషా, జాఫర్‌రెడ్డి, జానా సత్యం, రమిజాబి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి హక్కుల కోసం కృషి చేయండి: సాగు నీటి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియను రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియను గురువారం పట్టణంలోని ఆమె స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి చేపట్టాల్సిన సమగ్ర సమాచారంతో కూడిన వినతి పత్రాన్ని సమితి నాయకులు అందజేశారు. సాగు నీటి ప్రాజెక్టులు సమర్థవంతంగా పని చేయడానికి శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన చట్ట బద్ధమైన విధాన పరమైన నిర్ణయాలు అమలు గురించి ఎమ్మెల్యేకు బొజ్జా వివరించారు. శ్రీశైలం రిజర్వాయరు నీటి మట్టం 854 అడుగులుగా రూల్ కర్వ్ విద్యుత్ ఉత్పత్తి నాగార్జునసాగర్‌కు కేటాయించిన 264టీఎంసీలకు లోబడే విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలు అమలు అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. శ్రీశైలం ప్రాజెక్టులో పూడిక నివారణకు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని, ఆ దిశగా కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం 365 జీవో ద్వారా రాయలసీమలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన 102 ప్యాకేజీలను అర్థాంతరంగా నిలుపుదల చేయడంతో రాయలసీమలోని వివిధ ప్రాజెక్టులకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ జీవోతో గోరుకల్లు రిజర్వాయరుకు సంబంధించి కీలకమైన నిర్ణయాలు ఆగిపోవడంతో ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారని చెప్పారు. సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు జాఫర్‌రెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అభినందించిన కార్యదర్శి: ఎమ్మెల్యే అఖిలప్రియను ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నారాయణస్వామి గురువారం అభినందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎమ్మెల్యే మొదటిసారి రావడంతో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. మార్కెట్ కమిటీలో ఎమ్మెల్యే పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఎమ్మెల్యేను కలిసి అభినందించారు.

తిమ్మనపల్లెను సందర్శించిన ఎమ్మెల్యే

రుద్రవరం: మండలంలోని తిమ్మనపల్లె గ్రామాన్ని గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సందర్శించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, గుర్రం ఫకీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం ఇది: కోట్ల



ప్రభుత్వ హోల్‌సేల్ దుకాణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 11: ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేసే ప్రభుత్వం ఇది అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ చౌకధర హోల్‌సేల్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క రోజు కూడా నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు తీసుకోలేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నిత్యావసర ధరల కట్టడికి చర్యలు తీసుకు న్నారన్నారు. నిత్యావసర సరుకులను హోల్‌సేల్ ధరలకు ప్రజలకు అందు బాటులోకి తెచ్చారన్నారు. సోనమసూరి బియ్యం కిలో రూ.49, కందిపప్పు కిలో రూ.160లుగా నిర్ణయించి ప్రజలకు అందిస్తున్నారన్నారు. హోల్‌సేల్ మర్చంట్ అసోసియేషన్ సహకారాలు అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, ఆర్డీవో మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ధర్మవరం ఈశ్వరయ్య, లారీల బాషా, జయరాముడు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి : చల్లా



చల్లా విజయభాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న ఆర్యవైశ్యులు

అవుకు, జూలై 11: ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మేడం సతీష్‌కు మార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్య మత్యంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు సన్నితి చంద్రశేఖర్, మల్లెల సతీష్‌బాబు, విశ్వనాథం వీరయ్య, కాల్వ నాగభూషణం, కిశోర్, బచ్చు ప్రవీణ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

మన్నేనాయక్ తండా సర్పంచ్‌గా వెంకట లక్ష్మీబాయి

అవుకు, జూలై 11: మండలంలోని మన్నేనాయక్‌తండా సర్పంచ్‌గా వెంక ట లక్ష్మీబాయిని నియమించినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో సర్పంచ్‌గా ఉన్న దేవిబాయి అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిందన్నారు. జిల్లా పంచాయతీ ఆఫీసర్ ఆదేశాల మేరకు వెంకట లక్ష్మీబాయిని సర్పంచ్‌గా నియమించి ధ్రువీ కరణ పత్రాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామక్రిష్ణవేణి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ: అవుకు సచివాలయం-3, గుండ్లశింగవరం, అన్నవరం సచివాలయాలను తనిఖీ చేసినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ రిజిస్టర్‌లను తనిఖీ చేసి శాఖల వారిగా పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు.

కొలువుదీరిన పీర్లు

కొలిమిగుండ్ల, జూలై 11: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా గురువారం చావిడిల్లో పీర్లు కొలువుదీరాయి. మండలంలోని తిమ్మనాయినిపేట, మీర్జాపురం, బెలుం, గొర్విమానుపల్లె, తుమ్మలపెంట తదితర చాలా గ్రామాల్లో మొహర్రం వేడుకలు కొన సాగుతున్నాయి. ఈసందర్భంగా పీర్ల స్వాములకు నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రార్థనలు చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రుద్రవరం, జూలై 11 : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. రుద్రవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు క్యాల్షియం మాత్రల గురించి తల్లులకు వివరించామన్నారు. బాల్యవివాహాలు ఫోక్సోచట్టంపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, జూలై 11: గ్రామాల్లో ఎరువుల దుకాణ డీలర్లు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని పద్మావతి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. ఎరువులకు సంబంధించిన శాంపిళ్లను సేకరించామని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఆయుర్వేద వైద్యుడికి డాక్టరేట్

ప్యాపిలి, జూలై 11: ఆయుర్వేద వైద్యంలో విశేష సేవలందిస్తున్న వైద్యుడు రాంబాబుకు డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని హోసూ రు ఆసియా ఇంటర్ నేషనల్ యూనివర్సిటీ వారు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మండలంలోని విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తున్న రాంబాబు ఆయు ర్వేద వైద్యంలో కూడా రాణిస్తున్నారు. దీంతో యూనివర్సిటీ వారు తన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు రాంబాబు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో రాంబాబుకు ఉపాధ్యా యులు సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర నాయక్, ఎమ్మార్సీ రామాంజినేయులు, నవీన్, మద్దయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



డోన్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు, సంఘాల నాయకులు

డోన్(రూరల్), జూలై 11: నందికొట్కూరు తాలుకాలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సమైఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు షమీమ్ బేగం, మహిళా సమైఖ్య నాయకురాలు అమృతారెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థినులతో కలిసి పాతబస్టాండు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు వరదరాజు పాల్గొన్నారు.

- వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొత్తబస్టాండు ప్రధాన రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, మండల కార్యదర్శి అశోక్, డీవైఎఫ్ఐ నాయకులు మధుశేఖర్, నక్కిహరిలు మాట్లాడుతూ వాసంతిని హత్య చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్యాపిలి: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలోబాలికను హత్య చేసిన నిందితులన అరెస్టు చేయాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి పట్టణంలో వాల్మీకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు హనుమప్ప, శివ, చంద్ర, నాగరాజు, వెంకటరాముడు పాల్గొన్నారు.

రుద్రవరం: పగిడ్యాల మండలం ముచ్చుమరిలో వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గురువారం డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. ఇలాంటిఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొలిమిగుండ్ల: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై హత్య చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు, కొలిమిగుండ్ల టీడీపీ నేత ఉలువల నరసింహుడు, మహర్షి వాల్మీకీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ కోరారు. గురువారం కొలిమిగుండ్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో వినతిప్రతం సమర్పించారు. జనసేన అధ్యక్షుడు గుజ్జల పెద్దయ్య, రమణ, రామూర్తి, సీపీఎం నాయకులు దావీదు, వాల్మీకులు పాల్గొన్నారు.

కేవీకే సహకారంతో ఫుడ్ కోర్టు ఏర్పాటు



ఫుడ్ కోర్టును ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ ధనలక్ష్మి

బనగానపల్లె, జూలై 11: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో బనగానపల్లె పట్టణంలో గురువారం ఫుడ్‌కోర్టును గురువారం కోఆర్డినేటర్ ధనలక్ష్మి ప్రారంభించారు. యాగంటిపల్లెకు చెందిన లక్ష్మీదేవి, రాజేశ్వరి ఆధ్వర్యంలో శ్రీసాయి చిరుధాన్యాల ఫుడ్‌కోర్టును కొత్తబస్టాండ్ సమీపంలోని గుర్రెడ్డి కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ఫుడ్ కోర్టులో జొన్న, రాగి, కొర్ర ఆరిక, వరిగ, సజ్జలతో తయారుచేసిన పదార్థాలు వినియోగదారులకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక

ఆళ్లగడ్డ, జూలై 11: ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు ఏపి మోడల్ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజు గురువారం తెలిపారు. ఎంపికైన వారిలో వై.జోష్నాదేవి, వి.సమీర, తేజస్విని, ఎం.హబిబా, పి.వర్షిత ఉన్నారని తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మోమిన్ ట్రిబుల్‌ఐటీకి ఎంపికైంది. పాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారు. ఈ విద్యార్థిని ఇడుపుల పాయలోని ట్రిబుల్‌ఐటీకి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థిని మోమిన్‌ను హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ

శిరివెళ్ల, జూలై 11: మండలంలోని విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎంఈవో శంకర్ ప్రసాద్ తెలిపారు. శిరివెళ్లలోని ఎమ్మార్సీ కార్యాలయంలోని భవిత కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న విద్యాబోధన, ఫిజియోథెరపీని ఆయన పరిశీలించారు.

కేసు నమోదు

ఆళ్లగడ్డ, జూలై 11: నంద్యాల సీటి కేబుల్‌లో కలెక్షన్‌బాయ్‌గా పని చేస్తున్న వీర మల్లేశ్వరరెడ్డిపై ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులు దాడి చేసిన సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు గురువారం చెప్పారు. ఈ కేసులో నిఖిల్, భూపతి, రాజుతో పాటు మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

అవుకు, జూలై 11: మండలంలోని ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రత్నాచారి అన్నారు. గురువారం డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవుకు పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్, కస్తూర్బా, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులకు డెంగీపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నాచారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమియా, కస్తూర్బా ఎస్‌వో భవాని, హాస్టల్ వార్డెన్ రామక్రిష్ణ, పీహెచ్ఎన్ మల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు, దానమ్మ, వరలక్ష్మి, సీహెచ్‌వో సల్మాన్, ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె ఆదర్శ పాఠశాలలో డెంగీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, వైస్‌ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ హేమావతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బనగానపల్లె, జూలై 11: భానుముక్కల సొసైటీ సభ్యుడైన రైతు బ్రహ్మానందారెడ్డి ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేసినట్లు సొసైటీ సీఈవో మునాఫ్ తెలిపారు. గురువారం బాధిత కుటుంబ సభ్యురాలు లక్ష్మిప్రసన్నకు రూ.2లక్షల చెక్‌ను భానుముక్కల సొసైటీ బ్యాంక్ ఇన్‌చార్జి ప్రియాంక పంపిణీ చేశారు. ఫీల్డ్ అధికారి శతృఘ్నుడు, సిబ్బంది షామీర్ పాల్గొన్నారు.

చెర్వుపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం

బనగానపల్లె, జూలై 11: రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో మండలంలోని చెర్వుపల్లెలో తాగునీటి సమస్య గురువారం తీరడంతో గ్రామస్థులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, బీసీ ఇందిరమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని చెర్వుపల్లె గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సమస్య ఉంది. అయితే ఎట్టకేలకు మంత్రి బీసీ, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ సహకారాలతో నిధులు విడుదలై పనులు ప్రారంభించడంతో గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం అయిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ హాస్టళ్లను పునరుద్ధరించాలి

కొలిమిగుండ్ల, జూలై 11: కొలిమిగుండ్లలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను ప్రభుత్వం పునరుద్ధరించాలని మండల సీపీఎం కార్యదర్శి దావీదు డిమాండ్ చేశారు. పేద వర్గాలకు చెందిన పిల్లల చదువులు ఆపివేసి కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

బేతంచెర్ల, జూలై 11: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈవో సోమశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను మండల విద్యాధికారి గట్టు సోమశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాల ప్రేయర్ దగ్గర నుంచి తరగతుల నిర్వహణ, నాడు-నేడు పనుల పురోగతి, పనులు ఆగిపోవడానికి నిధుల కొర తను గుర్తించి తెలుసుకుని త్వరలోనే పై అధికారులకు చెప్పి నిధుల విడుదల చేయిస్తామని తెలిపారు. సీఆర్పీ కిషోర్, భాస్కర్ రెడ్డి, స్వాములు, కిరణ్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బేతంచెర్ల, జూలై 11: డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ 106 (1) (2)లను రద్దు చేయాలని, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువా రం పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముజహర్ అహ్మద్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.యేసురత్నం, ఏ.నాగరాజు, హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బేతంచెర్ల యూనియన్ కార్యదర్శి వైబీ వెంకటేశ్వర్లు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, డోన్ యూ నియన్ నాయకులు శివరాం, మండలాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలి: డీఎస్పీ

ప్యాపిలి, జూలై 11: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం తగు చర్యలు తీసుకో వాలన్నారు. అనంతరం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కొలిమిగుండ్ల, జూలై 11: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో అల్ట్రాటెక్ సిమెంట్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని గురువారం వసుంధర లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ మీనాక్షి ప్రారంభించారు. కుట్టు శిక్షణకు హాజరైన మహిళలకు టైలరింగ్ సామ గ్రిని ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యురాలు సరోజ, గోపాల్ రెడ్డి, వికాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

బనగానపల్లె, జూలై 11: పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరు ప్రాథమి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ తల్లి, బిడ్డల శ్రేయస్సు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలలోని ఆర్ఎస్ రంగాపురం, సిమెంటునగర్ గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ అలీమ్, డాక్టర్ మెహతాబ్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో అబ్దుల్ గఫార్, సూపర్ వైజ ర్లు రాజ్యలక్ష్మి, రూతమ్మ, ఇక్బాల్, సర్వేష్, హెల్త్ అసిస్టెంట్ రామాం జనేయులు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి బాయి, సువర్ణలక్ష్మి, ఏఎన్ఎంఎస్ ఫరీదా బాను, వరలక్ష్మి, ఆశాలు శాంతమ్మ, రాణి, మాధవి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వీధుల గుండా సాగింది. హెల్త్‌ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు మాట్లాడుతూ దంపతులు సంపూర్ణ ఆరోగ్య సంతానం కోసం జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యక ర్తలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

శిరివెళ్ల,: రోజురోజుకూ పెరుగుతున్న జనాభా భవిష్యత్తులో దేశ ప్రగతికి అవరోధంగా మారుతుందని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్లు రవి కిషోర్, అమినాబీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రుద్రవరం: ఫ్యామిలీ ప్లానింగ్ ప్రకారం బిడ్డ, బిడ్డకు మధ్య మూడేళ్ల ఎడం ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏదైనా ఫ్యామిలీ ప్లానింగ్ అవగాహనపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.